క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ నేడు

నెల్లూరు(బృందావనం): సత్యసాయి యూనిటీ కప్ టీ 20 క్రికెట్ టోర్నీని శనివారం నిర్వహించనున్నామని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుజబుజనెల్లూరులోని క్రికెట్ స్టేడియంలో పోటీలను ప్రారంభించనున్నామని తెలియజేశారు. విజేత జట్టు విశాఖపట్నంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుందని పేర్కొన్నారు. వివరాలకు 98499 84981, 94939 98193 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చేజర్ల: సైబర్ నేరాలపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సంగం సీఐ వేమారెడ్డి సూచించారు. ఆదూరుపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు సైబర్ నేరాలపై శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న నేరాలు, వాటి నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఆకతాయిలు వేధిస్తుంటే వెంటనే తల్లిదండ్రులకు లేదా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో చేజర్ల ఎస్సై ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ శైలజ, వైస్ ప్రిన్సిపల్ నాగలలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాణసంచా గోదాము తనిఖీ



చేజర్ల: ఆదూరుపల్లిలోని బాణసంచా గోదామును సంగం సీఐ వేమారెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. గోదాము వద్ద ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను యజమానికి సూచించారు. గోదాము సమీపంలో బాణసంచా తయారీ, పేల్చడం వంటివి చేయకూడదని తెలిపారు. గోదాముల ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి అన్నారు. అనధికారికంగా దుకాణాలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో చేజర్ల ఎస్సై ప్రభాకర్, ఏఎస్సై నాగరాజు పాల్గొన్నారు.

ఎక్సైజ్ డీసీని కలిసిన సిబ్బంది



నెల్లూరు(క్రైమ్): ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావును బీవీనగర్‌లోని ఆయన కార్యాలయంలో ఆ శాఖ హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు.

నగర పంచాయతీ కమిషనర్‌గా ఉమామహేశ్వరరావు



అల్లూరు: నగర పంచాయతీ కమిషనర్‌గా బి.ఉమామహేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న ఫణికుమార్ కావలి ఆర్వోగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో గుడివాడ ఆర్వోగా పనిచేస్తున్న ఉమామహేశ్వరరావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కాగా నూతన కమిషనర్‌ను నగర పంచాయతీ కార్యాలయ సిబ్బంది శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

స్కానింగ్ కేంద్రాల్లో నిబంధనలు పాటించాలి

నెల్లూరు(అర్బన్): రిజిస్ట్రేషన్, ఇతర నిబంధనలను పాటించే విషయంలో స్కానింగ్ కేంద్రాల యాజమాన్యాలకు డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆదేశాల మేరకు చివరి అవకాశాన్ని కల్పిస్తున్నామని ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ స్పష్టం చేశారు. నగరంలోని ఆశ్రిత ఆస్పత్రి, మాతృత్వ ఫెర్టిలిటీ సెంటర్, నిశ్చల శ్రీరామకృష్ణ కిడ్నీ ఆస్పత్రి, సాయిశ్రీ స్పెషాల్టీ, సరయూ ఆస్పత్రుల్లోని స్కానింగ్ కేంద్రాలను వైద్యశాఖ డెమో అధికారి కనకరత్నంతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పీసీ, పీఎన్డీటీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, స్కానింగ్ ధరల పట్టికను ప్రదర్శించాలని ఆదేశించారు. స్కానింగ్ చేసిన గర్భిణుల వివరాలను ఆన్‌లైన్లో పొందుపర్చాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఉదయగిరి: మండలంలోని వెంగళరావునగర్ సమీపంలోని పిల్లాపేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌తోపాటు జేసీబీని సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని చెప్పారు. ఎవరైనా అనుమతి లేకుండా మట్టి, ఇసుక అక్రమంగా తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హైవేపై దొంగల హల్‌చల్



కొడవలూరు మండలంలోని జాతీయ రహదారి

మండలంలోని జాతీయ రహదారిపై దొంగతనాలు పెరిగిపోతున్నాయి. లారీ డ్రైవర్లు వాహనాన్ని ఆపి నిద్రపోతే చాలు ఉదయాని కల్లా జేబులు ఖాళీ అవుతున్నాయి. కొందరైతే దాడి చేసి మరీ డబ్బులు దోపిడీ చేసి పరారవుతున్నారు. నగదు పోగొట్టుకుని పోలీస్‌ స్టేషన్‌కు వెళ్లే బాధితులను పట్టించుకునే వారు కరువయ్యారని ఆరోపణలున్నాయి.

- హడలిపోతున్న లారీ డ్రైవర్లు
- దాడులకు పాల్పడుతున్న దొంగలు
- పట్టించుకోని పోలీసులు

కొడవలూరు: మండలంలోని రాచర్లపాడు మొదలుకుని.. కోవూరు సాయిబాబా మందిరం ఫ్లై ఓవర్ వరకూ లారీలు ఆపి నిద్రపోయేందుకు లారీ డ్రైవర్లు హడలిపోతున్నారు. వాహనాలు నడిపి విశ్రాంతి కోసం కునుకు తీస్తే దొంగలు చెలరేగి జేబులు ఖాళీ అవుతున్నాయి.

ఎక్కడంటే..

చెన్నై వైపు వెళ్లే లారీల డ్రైవర్లు రేగడిచెలిక, కమ్మపాళెం పెట్రోలు బంకులు, నాయుడుపాళెం, కోవూరు నందలగుంట వద్ద ఉన్న ఖాళీ స్థలాల్లో వాహనాలు నిలిపి విశ్రాంతి తీసుకుంటుంటారు. కావలి వైపు వెళ్లే వాహనాలైతే నార్తురాజుపాళెం ఆంజనేయస్వామి గుడి, నాయుడుపాళెం పెట్రోలు బంకు, చంద్రశేఖరపురం వద్దున్న ఖాళీ స్థలాల్లో నిలుపుతారు. డ్రైవర్లు నిద్రపోయి లేచాక జేబులు చూసుకుంటే ఖాళీగా కనిపిస్తున్నాయి. దొంగలు ప్యాంట్ జేబులను కత్తిరించి నగదు చోరీ చేస్తున్నారు. ఒకవేళ లారీలో ఎక్కడైనా దాచినా దోచుకెళ్లిపోతున్నారు. అలికిడికి నిద్రలో ఉన్న డ్రైవర్ మేల్కొంటే దొంగలు దాడులకు పాల్పడి గాయపరిచి నగదుతో పరారవుతున్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి.

కేసుల సంగతి అంతే..

నగదు చోరీకి గురై కొడవలూరు, కోవూరు పోలీస్‌స్టేషన్లకు వెళ్తే లారీ డ్రైవర్ల నుంచి ఫిర్యాదులు తీసుకోవడం లేదు. పోలీస్ సిబ్బంది అనధికారికంగా తెల్ల కాగితంపై డ్రైవర్ పేరు, చోరీకి గురైన నగదు వివరాలు, చిరునామా రాసుకుని దొంగ దొరికితే ఫోన్ చేసి సమాచారం ఇస్తామని చెప్పి పంపేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇలాంటి బాధితుల కేసులు నమోదు చేయడం లేదు. రికార్డులకెక్కితే ఉన్నతాధికారుల ఒత్తిడితో దొంగలను గుర్తించి రికవరీ చేయాల్సి వస్తుందన్న కారణంతో వాటి జోలికెళ్లడం లేదు. దూరపు ప్రాంతాల నుంచి వచ్చే డ్రైవర్లు కావడంతో పోలీసులపై ఒత్తిడి తెచ్చి కేసు నమోదు చేయించుకునే సాహసం చేయలేక ఉసూరుమంటూ వెళ్లిపోతున్నారు. కొందరైతే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదని భావించి లారీ యజమానికి సమాచారం అందించి వదిలేస్తున్నారు. ఇలాంటి ఘటనలు ప్రతి నిత్యం కొడవలూరు, కోవూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోటుచేసుకుంటూనే ఉన్నాయి.

కొత్తవారే బాధితులు

హైవేపై ఒకసారి చోరీకి గురైన అనుభవం ఉన్న డ్రైవర్లు ఆ ప్రాంతంలో లారీలను నిలపకుండా జాగ్రత్త పడుతున్నారు. ఒకవేళ ఆపినా తగిన జాగ్రత్తలు తీసుకుని క్యాబిన్ లాక్ చేసుకుంటున్నారు. కానీ కొత్తవారు మాత్రం ఖాళీ స్థలం ఉందని నిలిపి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. దారి ఖర్చులకు కూడా నగదు లేక ఎంతో ఇబ్బందులు పడిన వారెందరో ఉన్నారు. కొందరైతే యజమానులకు ఏం సమాధానం చెప్పాలో పాలుపోక సతమతమవుతుంటారు. పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించి నిఘా పెట్టాలి. బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరముంది.

ఇటీవల

- కొద్దిరోజుల క్రితం గండవరం సబ్‌స్టేషన్ సమీపంలో హైవేపై లారీని ఆపి డ్రైవర్ నిద్రపోతున్నాడు. ఈ సమయంలో దొంగలు అతడిపై దాడి చేసి నగదును లాక్కెళ్లారు. డ్రైవర్ చేతికి గాయమైంది.
- కోవూరు సమీపంలో నందలగుంట వద్ద ఖాళీ స్థలంలో పదిరోజుల క్రితం లారీని ఆపి డ్రైవర్ విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ సమయంలో దొంగలు అతని ప్యాంట్ జేబుని కత్తిరించి నగదుతో పరారయ్యారు. ఇలాంటి ఘటనలు హైవేపై నిత్యం జరుగుతున్నాయి.

స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీలకు ఎంపికలు



బుచ్చిరెడ్డిపాళెం: ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పెనుబల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాక్సింగ్ పోటీలకు ఎంపికలు జరిగాయి. అండర్ – 14, 17 విభాగాల్లో బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. ఎంఈఓలు దిలీప్‌కుమార్, పీవీ రత్నం మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఎంపికైన వారు డిసెంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో నెల్లూరు జిల్లా తరఫున పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంచలయ్య, పాఠశాల హెచ్‌ఎం అనంతకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు సిరాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

- ఇందుకూరుపేట: త్వరలో జరిగే స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీలకు కొత్తూరు జెడ్పీ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 17 విభాగంలో బందెల అన్నమయ్య, సాయిరామ్, అండర్ 14 విభాగంలో కె.చందు, ఐ.దుర్గాప్రసాద్, ఈ.జోసెఫ్, ఎ.అంజనీకుమార్‌లు ఎంపికయ్యారన్నారు. వారిని, వ్యాయామ ఉపాధ్యాయులు అరోరాను హెచ్‌ఎం అభినందించారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

మనుబోలు: మండలంలోని జట్ల కొండూరు పంచాయతీ కుడితిపల్లి గ్రామంలో శుక్రవారం ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కట్టుమూని నాగమ్మ మాట్లాడుతూ గతంలో గ్రామంలో తాగునీటి సమస్య ఉందని అప్పటి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సహకారంతో ఎంపీపీ నిధులతో మార్చి నెలకు ముందే మినరల్ వాటర్ ప్లాంట్, మూడు హ్యాండ్ బోర్లను ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే కోడ్ వల్ల అప్పుడు ప్రారంభించలేదన్నారు. తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు పంచాయతీ తీర్మానంతో ఇప్పుడు ప్లాంట్‌ను ప్రారంభించామన్నారు.



వాటర్ క్యాన్‌ను అందజేస్తున్న దృశ్యం

కార్యక్రమంలో ఉప సర్పంచ్ తులసీరామ్, నాయకులు శ్రీనివాసులు, భద్రయ్య, వెంకయ్య సునీల్, మధు, సతీష్, బాబు, రవి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర అధ్యాపకులకు ప్రశంసాపత్రాలు

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు సుజిత్, నాగేంద్ర, దీప్తి, శాలినీలకు ఏఐఎంఈఆర్ఎస్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెడికల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ సొసైటీ) నుంచి ప్రశంసాపత్రాలు దక్కాయి. వచ్చే నెల 5న జరిగే అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అధ్యాపకులు పరిశోధనలు చేసి సమర్పించిన పత్రాలకు వారు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు బహూకరించారు. వీటిని ఆ కళాశాలలో చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ శుక్రవారం అధ్యాపకులకు అందజేసి అభినందించారు.



అధ్యాపకులతో చైర్మన్ గుణశేఖర్

కార్యక్రమంలో కళాశాల రీసెర్చ్, డెవలప్‌మెంట్ డీన్ వెంకటనాగేంద్ర, ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు, ఏఓ కె.గిరీష్ పాల్గొన్నారు.

భూముల పరిహారం తగ్గించారు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ముత్తుకూరు: మండలంలో సాగరమాల రోడ్డు కోసం రైతుల నుంచి సేకరించిన భూములకు తక్కువ పరిహారం ఇచ్చారంటూ సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోగుల శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యుడు గడ్డం అంకయ్యలు శుక్రవారం స్థానిక కార్యాలయంలో తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. తాము ఎకరాకు రూ.80 లక్షలు డిమాండ్ చేస్తే నేషనల్ హైవే అథారిటీ రూ.33 లక్షలు ఇచ్చిందన్నారు. ఈ రోడ్డు కోసం అలైన్‌మెంట్ మార్చే ప్రయత్నాన్ని విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మాజీ సర్పంచ్‌పై కేసు నమోదు


పొదలకూరు: మండలంలోని నావూరు మాజీ సర్పంచ్ బొడ్డు నరసింహులుపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హనీఫ్ కథనం మేరకు.. పాత బిల్లులపై సంతకాలు చేయాల్సిందిగా నరసింహులు బెదిరిస్తూ విధులకు ఆటంకం కలిగించినట్లు సచివాలయం సెక్రటరీ సుప్రియ రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు అవగాహన



కొడవలూరు: మండలంలోని తాటాకులదిన్నె ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. చేతులను ఏ విధంగా సబ్బుతో శుభ్రం చేసుకోవాలని చూపించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, పంచాయతీ కార్యదర్శి దామోదర్, అంగన్‌వాడీ కార్యకర్త అరుణ, సహాయకులు అమూల్య, లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం



చెక్కును అందజేస్తున్న విద్యార్థినులు

తోటపల్లిగూడూరు: విజయవాడ వరద బాధితుల కోసం మండలంలోని చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాల విద్యార్థులు రూ.54,161లు సేకరించారు. దీనికి సంబంధించిన చెక్కును శుక్రవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయి ప్రసాద్, ఉపాధ్యాయులు ఫణికుమార్, రమణప్రసాద్, విద్యా కమిటీ చైర్మన్ ఠాగూర్, స్థానిక నాయకులు వీరబోయిన గంగాధర్, రాజా, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిపూడిలో ఎమ్మెల్యే పర్యటన

ముత్తుకూరు: సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం మండలంలోని మామిడిపూడి గ్రామంలో పర్యటించారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను పంపిణీ చేశారు. సమస్యలపై స్థానికుల నుంచి అర్జీలు స్వీకరించారు. పలువురు అధికారులు, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

4 నుంచి టీచర్లకు శిక్షణ

ఆత్మకూరు: స్టెప్ ఆధ్వర్యంలో వచ్చే నెల 4 నుంచి మూడ్రోజులపాటు ఉపాధ్యాయులకు వ్యక్తిత్వ వికాశం, వక్తృత్వం తదితర అంశాలపై శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు స్టెప్ సమన్వయకర్తలు కోలా సుజాత, దమ్ము పద్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నెక్కల్లులో నిర్వహించనున్న తరగతులను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాకాణిని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



గోవర్ధన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మనుబోలు నాయకులు

మనుబోలు: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన నేపథ్యంలో మనుబోలు మండలం వడ్లపూడి, గొట్లపాళెం గ్రామాలకు చెందిన పలువురు నాయకులు శుక్రవారం నెల్లూరులో ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు. ఈగా సురేష్, పందిపాటి రాఘవరెడ్డి, సుధీర్‌రెడ్డి, జయరామిరెడ్డి, గండవరపు ప్రతాప్‌రెడ్డి, అజయ్ తదితరులు కాకాణిని కలిసి అభినందించారు.

- తోటపల్లిగూడూరు: వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కాకాణి గోవర్ధన్‌రెడ్డికి పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. వరగొండ పంచాయతీకి చెందిన కామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లిపూడి సునీల్‌రెడ్డి, చిల్లకూరు ప్రవీణ్‌రెడ్డి, కోసూరు రవీంద్రయ్య తదితరులు శుక్రవారం నెల్లూరులో గోవర్ధన్‌రెడ్డిని కలిశారు. అలాగే దగ్గు సతీష్ ఆధ్వర్యంలో ముంగళదొరువు గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.



టీపీగూడూరు: మాజీ మంత్రితో వరిగొండ నేతలు

నేడు పూజలు

పొదలకూరు: కాకాణి గోవర్ధన్‌రెడ్డి పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పూజల్లో పాల్గొనాల్సిందిగా కోరారు.

పర్యాటక రంగంలో ఉద్యోగావకాశాలు

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: పర్యాటక రంగంలో ఉద్యోగావకాశాలు విస్తృతంగా లభిస్తాయని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో శుక్రవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ పర్యాటక రంగం అభివృద్ధి చెందడంతో ప్రతిభ ఉన్న విద్యార్థులకు ఉద్యోగాలు బాగా లభిస్తున్నాయని చెప్పారు. పర్యాటక రంగం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, సాంస్కృతిక మార్పులపై, సామాజిక స్థిరత్వంపై చూపే ప్రభావం గురించి వివరించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత విద్యార్థులకు ఉద్యోగావకాశాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ విజయ, అధ్యాపకులు జవహర్‌బాబు, డాక్టర్ త్యాగరాజు, సుజాత, విజేత, విక్రమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న వీసీ తదితరులు

పౌష్టికాహారం తీసుకోవాలి

కొడవలూరు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి సూచించారు. మండలంలోని పాతవంగల్లు మజరా రమణారెడ్డి గుంటలో శుక్రవారం పోషకాహార పదార్థాల ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకుకూరలు, పాలు, గుడ్లు, పండ్లు, చిరుధాన్యాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకుని పోషకాహార లోపం తలెత్తకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.పద్మావతి, ఐ.విజయ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్

రెడ్ల మేధోమథన సదస్సు రేపు

నెల్లూరు(బృందావనం): రెడ్ల మేధోమథన సదస్సును నగరంలోని భక్తవత్సలనగర్‌లో ఆదివారం నిర్వహించనున్నామని రెడ్ల ఐక్యవేదిక అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి పేర్కొన్నారు. శాంతినగర్‌లోని నిర్మల సౌధలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలువుర్ని సత్కరించారు. కార్యక్రమంలో వేదిక నిర్వాహకులు డాక్టర్ బీవీ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, కృపాకర్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సుధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

వేదగిరి లక్ష్మీనృసింహుడి దేవస్థాన ఈఓగా గోపీ

నెల్లూరు సిటీ: వేదగిరి లక్ష్మీనృసింహుడి దేవస్థాన ఈఓగా వేమూరి గోపీ బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. మెట్ల పూజ చేసి, మెట్ల మార్గం ద్వారా కాలినడకన కొండపైకి చేరుకున్నారు. స్వామి, అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆయనకు ఆశీర్వచనాలను వేదపండితులు అందజేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ పరిశీలకుడు సుధీర్, వేదపండితులు కృష్ణమాచార్యులు, అప్పలాచార్యులు, మురళీధరాచార్యులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న గోపీ

సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ నూతన సబ్ రిజిస్ట్రార్‌గా వెరిచర్ల కోటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న అహ్మద్‌బాషా గూడూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నెల్లూరులో విధులు నిర్వహిస్తున్న కోటేశ్వరరావు వింజమూరుకు వచ్చారు. కాగా జూనియర్ అసిస్టెంట్‌గా జయకృష్ణ, అటెండర్‌గా కరీముల్లా బదిలీపై వచ్చి చేరారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

నెల్లూరు(టౌన్): ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను శుక్రవారం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. మూడు సీలింగ్ ఫ్యాన్లను సీజీఎస్టీ సూపరింటెండెంట్ మురళీకృష్ణ అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు, శ్రీనివాసులు, జయేంద్ర, ఉపాధ్యాయులు హరీష్, రాశి తదితరులు పాల్గొన్నారు.

